సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 19 । జనవరి । 2024



37 మంది ఎస్సైల బదిలీ

ఏలూరు రేంజ్ పరిధిలో మరో 37 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగిస్తూ ఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

8లో ▸



ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడులో జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ముగిశాయి. లయోలా హైదరాబాద్, ఏలూరు జట్లు విజేతలుగా నిలిచాయి.

8లో ▸

స్మృతివనం.. మహత్తర కార్యం



విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది.

8లో

న్యూస్‌రీల్

గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా వనిత



తానేటి వనిత, హోం మంత్రి

ద్వారకాతిరుమల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గోపాలపురం, కొవ్వూరు అసెంబ్లీ స్థానాలకు వైఎస్సార్ సీపీ అధిష్టానం గురువారం సమన్వయకర్తలను నియమించింది. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు అసెంబ్లీ సమన్వయకర్తగా, కొవ్వూరు ఎమ్మెల్యే, రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితను గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినట్టు ప్రకటించింది. మంత్రి వనిత 2009 నుంచి 2014 వరకు గోపాలపురం ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019లో కొవ్వూరు నుంచి ఆమె విజయం సాధించి హోం మంత్రి పదవి చేపట్టారు. గోపాలపురం నియోజకవర్గంలో అందరికీ సుపరిచితురాలైన వనితను ఇన్‌చార్జిగా నియమించడంతో ఆమె గెలుపు సునాయాసమని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు అంటున్నారు. గోపాలపురం అభివృద్ధికి ఎమ్మెల్యే తలారి బాటలు వేశారని, కొవ్వూరులోనూ ఆయన విజయం తథ్యమని అంటున్నారు.

- **గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త** : తానేటి వనిత
- **ఊరు** : యర్నగూడెం, దేవరపల్లి మండలం, గోపాలపురం నియోజకవర్గం.
- **తల్లిదండ్రులు** : జొన్నకూటి బాబాజీరావు, సుశీలమ్మ.
- **జననం** : 24 జూన్ 1975
- **కుటుంబం** : భర్త శ్రీనివాసరావు, కుమార్తె ప్రణవి
- **విద్యాభ్యాసం** : ఎమ్మెస్సీ, బీఈడీ

21న గూడెంలో అదనపు జిల్లా కోర్టు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడేనికి అదనపు జిల్లా కోర్టు (ఏడీజే కోర్టు) మంజూరులో అందరి కృషి ఉందని తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు అన్నారు. స్థానిక కోర్టులో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ఆదివారం ఉదయం 10 గంటలకు ఏడీజే కోర్టు ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. ఏపీ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి శేషసాయి, జస్టిస్ నైనాల జైసూర్య, జస్టిస్ భానుమతి, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వి.గోపాలకృష్ణ హాజరవుతారని తెలిపారు. ప్రజల, న్యాయవాదుల సౌకర్యార్థం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ అప్పిరెడ్డి ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో పోస్టాఫీస్ బ్రాంచీ ప్రారంభం, సభా కార్యాక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రతి నెలా మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ప్రకటనలో తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి ఉద్యోగుల గ్రీవెన్స్‌లో భాగంగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

22న ఓటర్ల తుది జాబితా

ఉండి: జిల్లాలో ఈనెల 22న ఓటర్ల తుది జాబితా రానుందని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి(ఈఆర్‌ఓ), జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఆయన గురువారం నియోజకవర్గ స్థాయిలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వెలువడిన ముసాయిదా ఓటరు జాబితా తర్వాత ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించినట్లు చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,22,999 మంది ఓటర్లు ఉన్నారని, రాబోయే కొత్త ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ పూర్తి చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో సమావేశమై శిక్షణా కార్యక్రమాలపై మాస్టర్ ట్రైనర్స్‌తో సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికలను అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో పక్కాగా నిర్వహించాలన్నారు.

బ్యాండ్ పోటీలకు గురుకుల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈనెల 21, 22వ తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి బ్యాండ్ పోటీలకు తరలివెళ్లినట్లు ప్రిన్సిపాల్ బి.రాజారావు గురువారం తెలిపారు. కేంద్ర విద్యాశాఖ, రక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్న పోటీల్లో దేశంలోని 16 జట్లు పాల్గొంటాయన్నారు.

కులగణనకు నేడే శ్రీకారం

చరిత్రాత్మక నిర్ణయానికి వందనం

- 28 వరకు ఇంటింటా సర్వే
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- 6.40 లక్షల గృహాల సందర్శన
- బడుగుల కల సాకారం



సాక్షి, భీమవరం: సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయానికి శుక్రవారం శ్రీకారం చుట్టనుంది. బడుగు, బలహీన వర్గాల చిరకాల వాంఛను నెరవేరుస్తూ వందేళ్ల తర్వాత కులగణన చేపట్టనుంది. ఈనెల 28 వరకు ఇంటింటా సర్వేకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. అందుబాటులో లేని వారి వివరాల నమోదుకు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు వెసులుబాటు కల్పించింది.

726 ఉప కులాల లెక్కలు

బ్రిటీష్ హయాంలో 1881లో దేశంలో తొలిసారిగా జనాభా లెక్కలతో పాటు కులగణన చేశారు. తర్వాత 1921 వరకు పదేళ్లకు ఒకసారి కులగణన చేస్తూ వచ్చారు. తర్వాత కాలంలో జనగణన చేస్తున్నా కులగణన నిలిచిపోయింది. వివిధ కుల సంఘాల నుంచి కులగణన చేయాలన్న డిమాండ్ దీర్ఘకాలంగా ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో రిజర్వేషన్లు, ప్రభుత్వ పథకాల అమలులో ఎన్నో వందల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి. వారి కలను నెరవేరుస్తూ రాష్ట్రంలో తిరిగి కులగణన చేసేందుకు సీఎం జగన్ నిర్ణయించారు. సర్వే నిర్వహణ కోసం జిల్లా, మండల, గ్రామస్థాయిలో అధికారులకు శిక్షణతో పాటు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు. గత నవంబర్ చివరి వారంలోనే సర్వే నిర్వహించాలని భావించినా అనివార్య కారణాలతో వాయిదా పడింది. శుక్రవారం నుంచి కులగణన నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించింది. 726 కులాలకు సంబంధించి కులగణన చేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది.

సర్వే జరిగేదిలా..

- సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలి. వాటికి సంబంధించిన ధ్రువీకరణ ప్రతాలు అడగాల్సిన అవసరం లేదు.
- కులాంతర వివాహాలు చేసుకున్నవారికి, ఎవరి కులం వారికే నమోదు చేయాలి.
- ఇది స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న సర్వే. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే బలవంతం చేయనవసరం లేదు.
- సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుంది. ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు వెళ్లదు.
- వివరాలు నమోదు చేసినప్పుడు ఈకేవైసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ఎనిమిదేళ్లలోపు వయసున్న వారికి ఈకేవైసీ తప్పనిసరి కాదు.
- సర్వే పూర్తి చేసిన తర్వాత సచివాలయం సిబ్బంది, వలంటీర్ బయోమెట్రిక్ వేసి వివరాలను సబ్‌మిట్ చేయాలి.

పకడ్బందీగా సర్వే



జిల్లాలో పకడ్బందీగా కులగణన సర్వే చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. సేకరించిన వివరాలను పూర్తి గోప్యంగా, భద్రంగా ఉంచుతాం. ప్రభుత్వ విధాన నిర్ణయాలు రూపొందించేందుకు, సంక్షేమ పథకాల అమలుకు సర్వే వివరాలు దోహదపడతాయి. బలహీన, వెనుకబడిన వర్గాల వారికి మరింత మేలు చేసేందుకు వీలుంటుంది.

– పి.ప్రశాంతి, కలెక్టర్, భీమవరం

7,051 మంది ఎన్యూమరేటర్లు..
1,107 మంది సూపర్‌వైజర్లు

పశ్చిమగోదావరి జిల్లాలో పురపాలక సంఘాలు, నగర, గ్రామ పంచాయతీల పరిధిలో 6,40,610 గృహాలకు సంబంధించి 20,68,500 మంది జనాభా ఉన్నారు. వీరిలో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాల్లో ఎంత మంది ఏఏ ఉపకులాల జనాభా ఉన్నారు, వారి స్థితిగతులు తెలుసుకునేందుకు కులగణన దోహదపడుతుంది. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, ప్లానింగ్ తదితర శాఖలకు చెందిన 7,051 ఎన్యూమేటర్లు, 1,107 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యంలో ఎస్సీ, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు సర్వేను పర్యవేక్షిస్తారు. ఈనెల 28 వరకు ఇంటింటా సర్వే అనంతరం 29 నుంచి వచ్చేనెల 2 వరకు మిగిలిపోయిన వారి వివరాలు సేకరిస్తారు. ఫిబ్రవరి 15 వరకు సేకరించిన సమాచారాన్ని సచివాలయాల్లో క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు.

ఏయే వివరాలు సేకరిస్తారంటే..

- కుటుంబ సభ్యులు అందుబాటులో ఉన్నారా / మరణించారా / శాశ్వతంగా వలస వెళ్లారా.
- జిల్లా, జిల్లా కోడ్, మండలం/ మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ, పంచాయతీ కోడ్, వార్డు నంబర్, ఇంటి నంబర్.
- కుటుంబ పెద్ద పేరు, ఆధార్ నంబర్, కుటుంబ సభ్యుల సంఖ్య, కుటుంబ సభ్యుని పేరు, కుటుంబ పెద్దతో గల సంబంధం, రేషన్ కార్డు నంబర్.
- కుటుంబం నివాసం ఉంటున్న ఇల్లు (కచ్చా ఇల్లు, శ్లాబ్ ఇల్లు, డూప్లెక్స్ ఇల్లు, భవనం).
- ప్రస్తుత చిరునామా.
- మరుగుదొడ్డి సౌకర్యం ఉందా లేదా?
- మంచినీరు / తాగునీరు సదుపాయం ఉందా? (వీధి కుళాయి, బోర్‌వెల్, పబ్లిక్ బోర్‌వెల్, సొంత కుళాయి).
- పశు సంపద ఏమైనా కలిగి ఉన్నారా? (ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మొదలైనవి).
- వంట సాధనం (ఎల్‌పీజీ గ్యాస్, కిరోసిన్, కట్టెలు)

కుటుంబ సభ్యుల వివరాలు

- కుటుంబ సభ్యుని పేరు, తండ్రి పేరు, జెండర్, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, ప్రస్తుతం చేస్తున్న వృత్తి.
- వ్యవసాయ భూమి వివరాలు.
- నివాస స్థలం వివరాలు.

పేదలందరికీ సొంతిల్లు ప్రభుత్వ లక్ష్యం

వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.2.49 కోట్ల లబ్ధి



సీఎం జగన్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి, లబ్ధిదారులు

భీమవరం (ప్రకాశంచౌక్): పేదలందరికీ సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కొంద తొలి విడత నిధులను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా వీక్షించిన అనంతరం విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ ఇచ్చి సొంతింటి యాజమానులు కావాలన్నది చరిత్రాత్మక సంఘటన అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో మహిళా సాధికారత మరింత మెరుగుపడిందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదలు సొంతింటిని సమకూర్చుకుంటున్నారన్నారు.

16,469 మంది లబ్ధిదారులు

జిల్లాలో 16,469 మందికి సంబంధించి రూ.2.49 కోట్ల నమూనా చెక్కును కలెక్టర్ అందజేశారు. నియోజకవర్గాల వారీగా.. ఆచంటలో 3,547 మందికి రూ.58.15 లక్షలు, భీమవరంలో 1,580 మందికి రూ.22.99 లక్షలు, నరసాపురంలో 1,772 మందికి రూ.25.46 లక్షలు, పాలకొల్లులో 1,299 మందికి రూ.20.64 లక్షలు, తాడేపల్లిగూడెంలో 2,534 మందికి రూ.32.10 లక్షలు, తణుకులో 3,036 మందికి రూ.45.77 లక్షలు, ఉండిలో 2,253 మందికి రూ.36.57 లక్షలు, ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం మండలంలో 448 మందికి రూ.6.98 లక్షల లబ్ధి చేకూర్చినట్టు కలెక్టర్ తెలిపారు. డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి డా.ఆర్సీ ఆనంద కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎస్‌పీఎస్ ప్రసాదయాదవ్, హౌసింగ్ ఈఈలు బి.వెంకటరమణ, బి.వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కొట్టి కుటుంబరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, నాయకులు చిన మిల్లి వెంకటరాయుడు, నడింపల్లి అశోక్ వర్మ, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.



అబ్బురం.. అంబేడ్కర్ స్మృతివనం

ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్‌బాబు అగ్గిపుల్లలతో అంబేడ్కర్ స్మృతివనాన్ని నిర్మించి ఆకట్టుకున్నారు. శుక్రవారం విజయవాడ స్వరాజ్య మైదానంలో సీఎం జగన్ 206 అడుగుల అంబేడ్కర్ మహాశిల్పాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో అగ్గిపుల్లలతో స్మృతివనం నిర్మించినట్టు సురేష్‌బాబు తెలిపారు.

– ఏలూరు (టూటౌన్)

భీమవరానికి కొత్త మాస్టర్ ప్లాన్

ప్రగతికి మార్గం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పట్టణంలో పలు మార్పులు
- రింగు రోడ్లు, నూతన జోన్లు
- మున్సిపాలిటీతో పాటు 8 గ్రామాలకు వర్తింపు



భీమవరం పట్టణ వ్యూ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ కొత్త మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించి తుది ప్లాన్‌కు జీఓ విడుదల చేసింది. ఇది పట్టణాభివృద్ధికి శుభపరిణామంగా చెప్పవచ్చు. సుమారు 36 ఏళ్ల తర్వాత కొత్త మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఏలూరు అర్బన్ డెవలమెంట్ అథారిటీ (ఇడా) నూతన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్టును భీమవరం మున్సిపాలిటీలో ప్రదర్శనకు ఉంచారు. ఇందులో విలీన గ్రామాలైన రాయలం, చినఅమిరం, తాడేరు, కొవ్వాడ, నరసింహపురం కలుపుతూ ప్లాన్ సిద్ధం చేశారు. డ్రాఫ్టుపై వచ్చిన అభ్యంతరాలు, కమిటీల సూచనలు, సలహాలు మొత్తంగా 111 అంశాలను పరిశీలించి మార్పులు చేర్పులతో తుది మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసి ఈ మేరకు ఈనెల 17న జీఓ విడుదల చేశారు. నూతన మాస్టర్ ప్లాన్ భీమవరం మున్సిపాలిటీలో విలీన గ్రామాలైన తాడేరు, కొవ్వాడ, రాయలం, చిన అమిరం, నరసింహపురంతోపాటు విస్సాకోడేరు, కుముదవల్లి, అన్నవరం మొత్తం 8 గ్రామాలకు వర్తిస్తుంది.

36 ఏళ్ల తర్వాత..

భీమవరం పట్టణానికి 1987లో మొదటి మాస్టర్ ప్లాన్ తయారుచేయగా ఇప్పటివరకూ అదే కొనసాగుతుంది. 36 ఏళ్ల తర్వాత కొత్త మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఏలూరు అర్బన్ డెవలమెంట్ అథారిటీ (ఇడా) ద్వారా జీఓ జారీ చేసింది.

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషితో..

నూతన మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆయన పట్టణాభివృద్ధి, విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారు. నూతన మాస్టర్ ప్లాన్ ఆవశ్యకతను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి.. ఈమేరకు మాస్టర్ ప్లాన్ తయారీకి నిధులను మంజూరు చేయించారు. దీనిలో భాగంగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (విజయవాడ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ ఆఫ్ ఇండియా (విజయవాడ) బృందాలు సర్వే చేసి మాస్టర్ ప్లాన్ తయారు చేశాయి. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న జనాభా, విద్య, వైద్య, పారిశ్రామికంగా రంగాల్లో అభివృద్ధికి నూతన మాస్టర్ ప్లాన్ దోహదపడుతుందని పట్టణ ప్రజలు విప్ శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్నారు.

ముఖ్య అంశాలు

- పట్టణంలో రెండు 60 అడుగుల రోడ్ల నిర్మాణం సూచించారు. ఇందులో ఒకటి పీపీ రోడ్డు నుంచి భీమవరం–నరసాపురం రోడ్డుకు కనెక్టవిట్ ఔటర్ రింగ్ రోడ్డు కాగా మరొకటి విస్సాకోడేరు లేవుట్ నుంచి గునుపూడి జగనన్న లేఅవుట్‌కు అనుసంధానిస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు.
- గత 30 అడుగుల రోడ్లను అలాగే ఉంచి 40 అడుగుల రోడ్లను 60 అడుగులకు ప్రతిపాదించారు.
- పీపీ రోడ్డు (పాలకొల్లు–పామర్రు)ను 60 అడుగుల నుంచి 80 అడుగులకు ప్రతిపాదించారు.
- జువ్వలపాలెం రోడ్డును 80 అడుగులు యథాతథంగా చూపారు.

అభివృద్ధికి దోహదం



పట్టణంలో పెరుగుతున్న జనాభా, విలీన గ్రామాలు, ట్రాఫిక్ సమస్యలు తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాల దృష్ట్యా నూతన మాస్టర్ ప్లాన్ కోసం కృషి చేశాం. దీనిపై సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ఆయన స్పందించారు. కొత్త మాస్టర్ ప్లాన్‌తో పట్టణ రూపురేఖలు మారనున్నాయి. విశాలమైన రోడ్లు, కమర్షియల్, రెసిడెన్షియల్ ఇండస్ట్రీయల్, అగ్రికల్చర్ తదితర నూతన జోన్లు ఏర్పడనున్నాయి. మాస్టర్ ప్లాన్ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు వేగంగా ప్లాన్‌ను సిద్ధం చేయడం సంతోషం.

– గ్రంధి శ్రీనివాస్
ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే భీమవరం

భూ వినియోగ ప్రతిపాదనలు

రెసిడెన్షియల్, కమర్షియల్, మిక్సిడ్, ఇండస్ట్రీయల్, వర్క్ సెంటర్, పబ్లిక్, సెమీ పబ్లిక్, పబ్లిక్ యుటిలైజ్, రిక్రియేషన్ ఓపెన్ స్పేస్, ట్రాన్స్‌పోర్టేషన్, అగ్రికల్చర్ యూజ్ జోన్లు, ప్రొటెక్టెడ్ యూజ్ జోన్‌లుగా విభజించారు. మిక్సిడ్ జోన్‌లో కమర్షియల్, రెసిడెన్షియల్‌కు అవకాశం ఉంటుంది.



ప్లాన్ డ్రాఫ్టు (ఫైల్)

భారీగా విస్తరణ

భీమవరం పట్టణ విస్తీర్ణం 25.64 చదరపు కిలోమీటర్లు కాగా విలీన గ్రామాలు రాయలం 4.179, తాడేరు 9.03, చిన అమిరం 4.82, కొవ్వాడ 2.23, నరసింహపురం 1.85 చదరపు కిలోమీటర్లతో మొత్తం కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం 47.749 చదరపు కిలోమీటర్లు కానుంది.

సామాజిక న్యాయానికి ప్రతీక అంబేడ్కర్ మహాశిల్పం



ఏలూరులో బైక్ ర్యాలీ

ఏలూరు (టూటౌన్): సామాజిక న్యాయానికి ప్రతీకగా విజయవాడలో అంబేడ్కర్ మహాశిల్పం నిలుస్తుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా గురువారం ఏలూరులో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద ర్యాలీని మేయర్ షేక్ నూర్జహాన్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఏఎస్ఆర్ స్టేడియానికి చేరుకుంది. పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. శుక్రవారం విజయవాడలో అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించనున్న నేపథ్యంలో చేపట్టిన బైక్ ర్యాలీకి అపూర్వ స్పందన వచ్చింది. ఏఎస్ఆర్ స్టేడియంలో మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పది రోజుల నుంచి సామాజిక సమత సంకల్పం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే ఫొటో ఎగ్జిబిషన్, పోటీలు, రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. అంబేడ్కర్ భావజాలాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అశేషంగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలతో పాలన సాగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్ కు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెద బాబు, మున్నుల జాన్ గురునాథ్, వివిధ సంఘాల నాయకులు ఘంటా ప్రసాదరావు, డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, జుజ్జువరపు విజయనిర్మల, పొలిమేర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చరిత్రాత్మకం

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పేరిట విజయవాడలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహం ఒక చరిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అంబేడ్కర్‌పై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం రూ.400 కోట్లకు పైగా వెచ్చించి విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటుచేయడమే అన్నారు. ప్రపంచ మేధావిగా గుర్తింపు పొంది.. సంఘ సంస్కర్తగా అంబేడ్కర్ చేసిన సేవలు అజరామరమన్నారు. ఆ మహానేత రచించిన రాజ్యాంగం ప్రకారమే తాను ఎమ్మెల్యే, మంత్రి కాగలిగానని స్పష్టం చేశారు. సుమారు 20 ఎకరాల్లో ఏర్పాటుచేసిన ఈ స్మృతివనం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందనుందని, పర్యాటక ప్రాంతంగా కూడా ఈ స్మృతివనాన్ని తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. శుక్రవారం ఈ అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది హాజరుకానున్నారని, తణుకు నియోజకవర్గం నుంచి సైతం అత్యధిక సంఖ్యలో విజయవాడకు తరలి వెళ్తున్నామని తెలిపారు. అత్యాధునికంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహం లేజర్ లైటింగ్‌తో రూపుదిద్దుకున్న తీరు కనుల పండువగా ఉంటుందన్నారు.

క్లుప్తంగా

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

భీమవరం: ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి తనకు రావాల్సిన బీమా పత్రాలు ఇవ్వడం లేదంటూ ఒక వ్యక్తి చినఅమిరంలోని సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళితే.. లోకం ఏసు అనే వ్యక్తి తన తండ్రి సత్యనారాయణ మూర్తి ఐదేళ్ల క్రితం రహదారి ప్రమాదంలో మృతి చెందాడని, బ్యాంకు నుంచి రావాల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పత్రాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని గత కొన్నేళ్లుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. తన సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్‌పైనే నిరసన వ్యక్తం చేస్తానంటూ టవర్ ఎక్కాడు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులు వెళ్లి అతనితో మొబైల్లో మాట్లాడినా ఫలితం లేదు. గురువారం రాత్రి పదిన్నర గంటల సమయం వరకు సెల్ టవర్ నుంచి ఏసు కిందకు దిగిరాకపోవడం గమనార్హం.

పాక్లెయిన్ డ్రైవర్‌పై పెట్రోల్‌తో దాడి

భీమవరం: బ్యాంకు ద్వారా తాను స్వాధీనం చేసుకున్న ఇంటి వద్ద ఉండగా, గత యజమాని పెట్రోల్ పోసి నిప్పంటించడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సుంకర పద్దయ్య వీధికి చెందిన సుశీల అనే మహిళకు చెందిన ఇంటిని గత ఏడాది ఆగస్టులో యూనియన్ బ్యాంకు వేలం నిర్వహించగా, బొగ్గు జయరాం అనే వ్యక్తి పాడుకున్నారు. అయితే అప్పటి నుంచి ఆ ఇంటిని ఖాళీ చేయకపోవడంతో గురువారం బ్యాంకు అధికారులు పోలీసుల సహాయంతో తాళాల బద్దలు కొట్టి జయరాంకు అప్పగించారు. దీంతో జయరాం సాయంత్రం సమయంలో పొక్లెయిన్‌తో ఇంటి వద్ద పని చేస్తుండగా సుశీల భర్త బకెట్లతో పెట్రోల్ తీసుకువచ్చి పొక్లెయిన్ డ్రైవర్‌పై పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో పొక్లెయిన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని వివరాలు సేకరించారు.

ఆన్‌లైన్‌లో మహిళకు టోకరా

జంగారెడ్డిగూడెం: ఆన్‌లైన్ మోసగాళ్ల చేతిలో ఒక మహిళ చిక్కుకుని రూ.66,500 నగదును పోగొట్టుకుంది. దీనికి సంబంధించి ట్రైనీ డీఎస్పీ విద్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ మహిళకు వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లో గత ఏడాది డిసెంబర్‌లో అమెజాన్ షాపింగ్ స్టోర్ లింక్ వచ్చిందన్నారు. పార్ట్‌టైం ఉద్యోగమని, అధిక ఆదాయం సంపాదించవచ్చని లింక్‌లో పేర్కొనడంతో లింక్‌ను క్లిక్ చేసిందన్నారు. స్టోర్ ద్వారా వస్తువులను కొనుగోలు చేసి అమ్మకాలు చేయాల్సి ఉంటుందని తెలపడంతో, టాస్క్‌లను పూర్తిచేసి, వస్తువులు కొనుగోలుకు దఫదఫాలుగా రూ. 66,500 నగదును లింక్‌లో పేర్కొన్న యాప్‌కు మహిళ పంపిందన్నారు. ఎన్నిరోజులైనా నగదు విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

అంబేడ్కర్ స్మృతివనం.. మహత్తర కార్యం

- నేడు విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవం
- అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పాన్ని జాతికి అంకితం చేయనున్న సీఎం వైఎస్ జగన్
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు

ఏలూరు (టూటౌన్): విజయవాడలోని స్వరాజ్యమైదాన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహం, స్మృతివనం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభోత్సవం జరుపుకోనున్న తరుణంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. కుల, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దేశానికే తలమానికంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం రాష్ట్రానికే ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురానుందని ఆనందాలు వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ మహా విగ్రహం కులంపై కత్తెత్తి, మతంపై దుమ్మెత్తి పోసిన మహామనిషి, నవ భారత నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని గుర్తు చేస్తున్నారు. 20వ శతాబ్దపు భారతీయ బహుముఖ వేత్త, మానవ హక్కుల విజేత, భారత రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్ అని, అటువంటి మహనీయుని విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేయడంపై ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్మృతి వనం విశేషాలు ఇవీ..

నేడు ప్రారంభించనున్న అంబేడ్కర్ విగ్రహం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం కన్నా పెద్దది. విగ్రహం ఎత్తు 206 అడుగులు. ఈ ప్రాజెక్టు మొత్తం విస్తీర్ణం 20 ఎకరాలు కాగా, రూ.400 కోట్ల వ్యయంతో ప్రభుత్వం దీన్ని నిర్మించింది. విగ్రహంతో పాటు మెమోరియల్ పార్కును ఏకకాలంలో 3 వేల మంది సందర్శించేలా ఉంది. పెద్ద కన్వెన్షన్ హాల్, అంబేడ్కర్ మెమోరియల్ లైబ్రరీ, అందులో ఆయన రాసిన, సేకరించిన 10 వేల పుస్తకాలు ఉంచనున్నారు. బౌద్ధ ధ్యాన మందిరం, ప్రకృతి రమణీయత ఉట్టిపడే దృశ్యాలతో ఉద్యాన వనాలు, పార్కు, రెండు వేల మంది కూర్చునే వీలున్న ఓపెన్ ఎయిర్ థియేటర్‌తో పాటు వాటర్ ఫౌంటెయిన్, మ్యూజికల్ ఫౌంటెయిన్ నిర్మాణం చేశారు.

భారీగా తరలివెళ్ళేందుకు సన్నద్ధం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా, ఏలూరు నగరం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఈ మహత్తర కార్యాన్ని కన్నులారా తిలకించి పులకించేందుకు ఉత్సాహం చూపుతున్నారు.



నేడు విజయవాడలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్న అంబేడ్కర్ విగ్రహం

అభ్యుదయ సమాజ స్థాపన జరగాలి



ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన విధంగా స్వేచ్ఛ, సమానత్వం ద్వారా అందరూ సాధికారత సాధించి అభ్యుదయ సమ సమాజస్థాపన జరగాలి. సీఎం చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభోత్సవం చేసుకోనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐక్య విగ్రహం, స్మృతి వనం కార్యక్రమానికి కుల, మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలిరావాలి.

– డాక్టర్ జి.రాజేంద్ర ప్రసాద్, సభ్యులు, ఏపీ బాలల హక్కుల కమిషన్, అమరావతి

సరైన గౌరవం దక్కింది



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మృతివనం ఏర్పాటు ద్వారా తన చిత్త శుద్ధిని చాటుకుంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఈ కార్యక్రమం ద్వారా సరైన గౌరవం దక్కింది. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. నిజంగా ఈ నెల 19వ తేదీ పండుగ రోజు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– మేతర అజయ్ బాబు, అధ్యక్షులు, మానవతా స్వచ్ఛంద సంస్థ, ఏలూరు

లక్షలాదిగా తరలిరావాలి



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19న ప్రారంభోత్సవం జరుపుకుంటున్న స్మృతి వనం కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది తరలిరావాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాంగ హక్కులు కల్పించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడు. ఇంతటి గొప్పకార్యక్రమాన్ని చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– జిజ్జువరపు రవిప్రకాష్, ఏపీ దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు, ఏలూరు

అంబేడ్కర్ ఆశయ సాధకుడు సీఎం జగన్



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం గొప్ప విషయం. పేదల పక్షపాతిగా నిరంతరం బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం సీఎంకు ధన్యవాదాలు. దేశానికే తలమానికంగా నిలిచేలా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం.

– కలతోటి హెన్రీ డోమినిక్, చైర్మన్, కరుణోదయ మానసిక విభిన్న ప్రతిభావంతుల పాఠశాల

టైరు పంక్చరై అదుపుతప్పి..

- ఆగి ఉన్న మరో లారీని ఢీకొన్న లారీ
- లారీలో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి
- మొగల్తూరు హైవే వద్ద ఘటన



ప్రమాదంలో తిరగబడ్డ లారీ

మొగల్తూరు: మొగల్తూరు వద్ద నల్లంవారితోట సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామం నుంచి తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి ధాన్యం లోడుతో గురువారం బయలుదేరింది. మొగల్తూరు వద్దకు వచ్చేసరికి లారీ టైరు పంక్చరై అదుపుతప్పి రోడ్డు పక్కనే ఆగి ఉన్న మరో లారీని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న మాదాసు నాగబాబు (38) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై మృతుడికి వరుసకు సోదరుడైన సీతారాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20న మొగల్తూరులో మెగా వైద్య శిబిరం

కృష్ణంరాజు భార్య ఉప్పలపాటి శ్యామలాదేవి వెల్లడి



కృష్ణంరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భార్య శ్యామలాదేవి

మొగల్తూరు: దివంగత కేంద్ర మాజీ మంత్రి, రెబల్ స్టార్ యూవీ కృష్ణంరాజు జయంతి సందర్భంగా ఈనెల 20న మొగల్తూరులో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కృష్ణంరాజు భార్య ఉప్పలపాటి శ్యామలాదేవి కోరారు. గురువారం మొగల్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కృష్ణంరాజుకు మొగల్తూరు అంటే ఎనలేని అభిమానం అని, దీంతో ఆయన జయంతిని పురస్కరించుకుని సుగర్ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో గ్యాంగ్రీన్ బాధితులకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. పాదాల్లో పగుళ్లు, మచ్చలు, గాయాలు, పుండ్లు, స్పర్శ కోల్పోవడం తదితర లక్షణాలున్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లండన్‌కు చెందిన ప్రముఖ దయాబెటిక్ ఫుట్ సర్జన్ డాక్టర్ వేణు కవర్తపుతో పాటు లండన్, అబుదబి, హైదరాబాద్, విజయవాడ, భీమవరానికి చెందిన సుమారు 30 మంది ప్రముఖ వైద్యులు ఈ శిబిరంలో సేవలందిస్తారన్నారు. ఇకపై యూకే ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వైద్య సేవలు అందిస్తామన్నారు. తమ కుటుంబ వారసుడు హీరో ప్రభాస్, తన ముగ్గురు కుమార్తెలు కృష్ణంరాజు పేరిట విద్య, వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకరిస్తున్నారన్నారు. తన ప్రథమ కుమార్తె సాయి ప్రసిద్ధ మొగల్తూరులో నిర్వహించే మెగా వైద్య శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్టు శ్యామలాదేవి వివరించారు. ఈ సమావేశంలో దాసరి బాబి, పీఎంపీ సంఘ నాయకులు కేఎస్‌పీఎస్ ముక్తేశ్వరరావు, సీహెచ్ బాబ్జి, పులపర్తి రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మరో 37 మంది ఎస్సైల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో మరో 37 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. రేంజ్ పరిధిలోని ఏలూరు జిల్లా, ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్, తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణా, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 26 మంది ప్రమోటీ ఎస్ఐలు కాగా, 11 మంది డైరెక్ట్ ఎస్ఐలు ఉన్నారు.

ఎస్సై పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన స్థానం
కె.ప్రమీల	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
గుణ్ణం ఫణీంద్ర	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
బారోతు నాగమణి	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
బి.రవితేజ	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
పులికోటి నవీన్‌కుమార్	కృష్ణా జిల్లా	ఏలూరు జిల్లా
నంబూరి చంటి	ఆగిరిపల్లి	విజయవాడ కమిషనరేట్
చావా సురేష్	వీఆర్, ఏలూరు	తూర్పుగోదావరి
గొర్రెల వెంకటేష్	నూజివీడు టౌన్	కాకినాడ జిల్లా
ఇజ్జాపు వీర్రాజు	ఏలూరు జిల్లా	విజయవాడ కమిషనరేట్
శీలం శంకర్	ఏలూరు జిల్లా	విజయవాడ కమిషనరేట్
పి.వాసు	కాకినాడ జిల్లా	ఏలూరు జిల్లా
ప్రమోటీ ఎస్సైలు		
ఎస్సై పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
బీఈ వెంకటేశ్వరరావు	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
కె.శేషారెడ్డి	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
బీవీ రామారావు	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
పీఎస్ ప్రకాషరావు	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
జె.రంగయ్య	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
కేవీడీ మల్లేశ్వరి	విజయవాడ కమిషనరేట్	ఏలూరు జిల్లా
వేపటి రాజేంద్రప్రసాద్	కృష్ణా జిల్లా	ఏలూరు జిల్లా

ఎస్సై పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
జీవీ ప్రసాదరావు	కృష్ణా జిల్లా	ఏలూరు జిల్లా
పి.ప్రసాదరాజు	కృష్ణా జిల్లా	ఏలూరు జిల్లా
వేకూరి జాస్మిన్	కృష్ణా జిల్లా	ఏలూరు జిల్లా
టి.వెంకటరమణ	కృష్ణా జిల్లా	ఏలూరు జిల్లా
పి.రామకృష్ణారావు	ఏలూరు జిల్లా	విజయవాడ కమిషనరేట్
బి.శ్రీనివాసరావు	ఏలూరు జిల్లా	విజయవాడ కమిషనరేట్
కె.శ్రీధర్	ఏలూరు జిల్లా	అల్లూరి జిల్లా
ఎస్ఎస్ఎస్‌వీ ప్రసాద్‌నాయుడు	ఏలూరు జిల్లా	విజయవాడ కమిషనరేట్
పీసీహెచ్ రఘురావ్	ఏలూరు జిల్లా	విజయవాడ కమిషనరేట్
ఆర్.వెంకటేశ్వర్లు	ఏలూరు జిల్లా	అల్లూరి జిల్లా
ఎండీ మక్బూల్	ఏలూరు జిల్లా	కృష్ణా జిల్లా
ఎస్.శ్రీనివాసులు	ఏలూరు జిల్లా	కృష్ణా జిల్లా
కె.రాంబాబు	ఏలూరు జిల్లా	కృష్ణా జిల్లా
ఏసీహెచ్ శేఖర్	ఏలూరు జిల్లా	కృష్ణా జిల్లా
జి.కేశవరావు	ఏలూరు జిల్లా	కృష్ణా జిల్లా
బి.రాధాకృష్ణ	ఏలూరు జిల్లా	తూర్పుగోదావరి
జి.అజయ్‌కుమార్	ఏలూరు జిల్లా	కృష్ణా జిల్లా
ఎంఆర్‌కే రాజు	అల్లూరి జిల్లా	ఏలూరు జిల్లా
కేఎస్ఎన్‌మూర్తి	అల్లూరి జిల్లా	ఏలూరు జిల్లా

వైభవంగా వేమన జయంత్యుత్సవాలు



కబడ్డీ పోటీల విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: ప్రజాకవి శ్రీయోగివేమన తన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలిపి, తెలుగుభాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆరవల్లిలో యోగివేమన జయంతి ఉత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు మంత్రి కారుమూరి గురువారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. యువత వేమన పద్యాలలో నీతిని గ్రహించి జీవితంలో మంచి స్థితికి చేరుకోవాలని చెప్పారు. ఆరవల్లి గ్రామాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కబడ్డీ, ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డిని మంత్రి కారుమూరి సన్మానించారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్ పాల్గొన్నారు.

కోలాహలంగా ఉత్సవాలు



ఆరవల్లిలో వేమనను దర్శించుకుంటున్న సినీ నిర్మాత, దర్శకుడు అచ్చిరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి

ఆరవల్లిలో ప్రజాకవి శ్రీయోగి వేమన 99వ జయంత్యుత్సవాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున వెలగల దాసు వంశీయులు వేమనకు గోస్తనీ నదిస్నానం చేయించారు. వేమన మందిరాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కీర్తనలు, కోలాట భజన, సినీ సంగీత విభావరి నిర్వహించారు. బ్యాండు మేళాలు, మంగళవాయిద్యాల నడుమ, బాణసంచాకాల్పులతో విశేషంగా అలంకరించిన పల్లకిపై వేమన చిత్రపటాన్ని ఉంచి గ్రామ పురవీధులలో ఊరేగించారు. వేమన పల్లకీ కింద నుంచి తల్లిదండ్రులు తమ చిన్నారులను దాటించారు. ఇలా చేస్తే పిల్లలకు ఆయుష్షు పెరుగుతుందనేది గ్రామస్తుల నమ్మకం. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దేశ, విదేశాలలో ఉన్నవారు స్వగ్రామానికి చేరుకుని బంధుమిత్రులతో ఉత్సాహంగా గడిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామానికి చెందిన సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత కె.అచ్చిరెడ్డి వేమనను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి సత్కరించారు. క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న కబడ్డీ పోటీలను తిలకించారు. ఉత్సవాల్లో భాగంగా శునకాలకు అన్నదానం చేశారు. పలు రకాల ఆహార పదార్థాలను కావిడిలో పెట్టుకుని గ్రామంలో తిరుగుతూ శునకాలకు విస్తరి వేసి వడ్డించారు.

బాస్కెట్‌బాల్ విజేతలు హైదరాబాద్, ఏలూరు



ఏలూరు జట్టుకు షీల్డు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



హైదరాబాద్ లయోలా జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముగిసిన నూజివీడు రాష్ట్ర స్థాయి పోటీలు

నూజివీడు: నూజివీడు డీఏఆర్ కళాశాలలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ 47వ స్మారక పురుషుల, మహిళల జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో పురుషుల విభాగంలో విజేతగా లయోలా హైదరాబాద్ జట్టు, మహిళల విజేతగా ఏలూరు జట్టు నిలిచాయి. లయోలా జట్టు తమ ప్రత్యర్థిపై ఒక్క పాయింట్ తేడాతో గెలుపొంది విజేతగా నిలిచింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. పురుషుల, మహిళల సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లతో పాటు తృతీయస్థానాలకు సంబంధించిన పోటీలను గురువారం నిర్వహించారు. పురుషుల విభాగంలో పురుషుల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన లయోలా జట్టు, ఆర్టిలరీ జట్టు, మహిళల విభాగంలో చత్తీస్‌గఢ్, ఏలూరు జట్టు ఫైనల్స్‌కు చేరాయి.

హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్‌లు

మహిళల, పురుషుల ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. మహిళల ఫైనల్ మ్యాచ్ ఛత్తీస్‌గఢ్, ఏలూరు జట్ల మధ్య జరగగా, విజయం కోసం ఇరు జట్లు హోరాహోరీగా పోరాడాయి. ఆట ద్వితీయార్థం నుంచి ఏలూరు జట్టు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి 58–52 తేడాతో విజయాన్ని కైవసం చేసుకున్నారు. పురుషుల ఫైనల్ మ్యాచ్ లయోలా, ఆర్టిలరీ జట్ల మధ్య ఆద్యంతం ఉత్కంఠభరితంగా, నువ్వా, నేనా అన్నట్లుగా సాగింది. ఈ పోరులో చివరికి లయోలా జట్టు ఆర్టిలరీపై 69–68 స్కోర్‌తో గెలుపొంది విజేతగా నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుల చేతుల మీదుగా నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు.

నూజివీడులో క్రీడలకు పెద్ద పీట: ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

47 ఏళ్లుగా రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తుండటం నూజివీడుకే గర్వకారణమని, నూజివీడులో క్రీడలకు పెద్దపీట వేయడం గత 60 ఏళ్లుగా కొనసాగుతోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. క్రీడలలో ప్రావీణ్యత ప్రదర్శించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడాకారులు కృషి, పట్టుదలతో ఆడి తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. పురుషుల, మహిళల విజేతలకు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు నగదు బహుమతులను స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, కనకం ట్రస్టు చైర్మన్ మిర్యాల కృష్ణకిషోర్, పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణ స్వామి, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి మోదీ కృషి

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఠాగూర్



ఉంగుటూరులో ప్రకృతి వ్యవసాయ ప్రదర్శనను పరిశీలిస్తున్న ఠాకూర్

ఉంగుటూరు: పేదల ఆర్థిక అభ్యున్నతికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని పార్లమెంట్ స్టాడింగ్ కమిటీ చైర్మన్ వివేక్ ఠాగూర్ అన్నారు. గురువారం ఉంగుటూరులో వికాసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన సభకు సర్పంచ్ బండారు సింధు అధ్యక్షత వహించారు. ఠాగూర్ మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, దీనిలో భాగంగా 90 శాతం ఎటువంటి హామీలు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తోందన్నారు. ముద్ర రుణాలు ఈ కోవలోకే వస్తాయన్నారు. అలాగే విశ్వకర్మ యోజన పథకం ద్వారా వెనుకబడిన చేతివృత్తుల కులాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఠాగూర్ ప్రసంగాన్ని సీతఊట సుబ్బారావు తెలుగులో అనువదించారు. బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఆర్టీఓ ఖాజావల్లీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, జేడీఏ రామకృష్ణ, తహసీల్దార్ వెంకట రమణ, భారతీయ కిసాన్ సంఘం అధ్యక్షుడు రామచంద్రరాజు పాల్గొన్నారు.

ఇంటి గుమ్మంలోకే రేషన్ బియ్యం

- గతంలో రేషన్ డిపోల వద్ద క్యూకట్టాల్సిన దుస్థితి
- వృద్ధుల పడిగాపులు
- నేడు ఎండీయూ వాహనాల ద్వారా గడపలోకే అందిస్తున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



తణుకులో ఎండీయూ వాహనం ద్వారా ఇంటిగుమ్మంలోనే బియ్యం అందజేస్తున్న దృశ్యం



తణుకులో టీడీపీ హయాంలో రేషన్ డిపో వద్ద క్యూకట్టిన లబ్ధిదారులు (ఫైల్) (ఫొటోలో చంద్రబాబు సాక్షిగా)

తణుకు అర్బన్: రేషన్ బియ్యం ఈరోజైనా అందుతాయో లేదో.. లైన్‌లో ఎన్ని గంటలు నిల్చోవాలిరా భగవంతుడా.. నిల్చోలేక కళ్లు తిరుగున్నాయి బాబూ అంటూ వృద్ధులు దీనంగా నిట్టూర్పులు విడిచే రోజులు పోయాయి. కాలం మారింది. ప్రభుత్వం కూడా మారింది. రేషన్ బియ్యం కోసం పడిగాపులు పడే రోజులకు శుభం కార్డు పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేషన్ దుకాణాలకు అనుసంధానంగా ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఇంటిగుమ్మంలోకే రేషన్ బియ్యం, సరుకులు అందజేయడంతో ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గంటల తరబడి క్యూలో నిల్చున్నప్పటికీ తీరా తన వంతు వచ్చేసరికి అవ్వాతాతల వేలిముద్రలు పడక సరుకులు అందని దుస్థితి ఉండేది. తణుకు నియోజకవర్గంలో తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో 87179 కార్డులు ఉండగా 149 డిపోలకు సంబంధించి 55 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం, కందిపప్పు అందిస్తున్నారు.

సాంకేతికత జతపరచి...

ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తరువాత లబ్ధిదారుని ఇంటి గుమ్మంలోకే బియ్యం నేరుగా అందుతుంది. ఏ ఇంటి ముందు ఆ ఇంటికి సంబంధించిన వలంటీరు సమక్షంలో సరుకులు అందిస్తున్నారు. ఆధార్ కార్డు ద్వారా రేషన్ కార్డు ఉన్న కుటుంబసభ్యుల వివరాలు ఇప్పటికే పొందుపరచబడి ఉన్నాయి. ఇందులో భాగంగా ఆ కుటుంబంలో ఎవరు వెళ్లినా బియ్యం, సరుకులు ఇచ్చేస్తున్నారు. ఒకవేళ వృద్ధుల కార్డుకు సంబంధించి మిషన్‌లో వేలిముద్రలు గుర్తించబడని వారికి వార్డు వలంటీరు స్వయంగా వేలిముద్రలతో బయోమెట్రిక్ ద్వారా సరుకులు అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

	రేషన్ డిపోలు	కార్డుల సంఖ్య	ఎండీయూ వాహనాలు
తణుకు మున్సిపాలిటీ	35	23739	14
తణుకు రూరల్	37	19633	13
అత్తిలి	39	22407	15
ఇరగవరం	38	21400	13

రేషన్ ఇంటి గుమ్మంలోకే..



రేషన్ బియ్యం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి గుమ్మంలోకే పంపుతున్న విధానాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. గతంలో రేషన్ డిపోకి వెళ్లి గంటల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి ఉండేది. కానీ ఇప్పుడు గడప వద్దకే రేషన్ బియ్యం అందిస్తున్నారు.

– జంగం ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు

లబ్ధిదారులు సంతోషిస్తున్నారు



రేషన్ బియ్యం, సరుకులు ఇంటిగుమ్మంలోకే పంపిస్తున్న వైనంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం ఎవ్వరూ అడగకుండానే ఎండీయూ వాహనం ద్వారా సిబ్బంది ఇంటి గుమ్మంలోకే వచ్చి సరుకులు ఇవ్వడంతో ముఖ్యంగా అవ్వాతాతలకు ఇబ్బందులు తప్పాయి.

– పిల్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు

ఇంటింటికీ రేషన్ బాగుంది



రేషన్ సరుకులు ఇంటి గుమ్మంలోకే వస్తున్న విధానం చాలా బాగుంది. ప్రత్యేక హారన్ మోగిస్తూ ఇంటి గుమ్మంలోకి ఎండీయూ వాహనం వస్తుండడంతో మేము బయటకు వచ్చి బియ్యం తీసుకుంటున్నాము. మావార్డు వలంటీరు దగ్గరఉండి బియ్యం, కందిపప్పు ఇప్పిస్తున్నారు. ఈ విధానం బావుంది.

– నూకల రమాదేవి, తణుకు

బయోమెట్రిక్ ద్వారా..



ఎండీయూ వాహనం కూడావెళ్తూ లబ్ధిదారుల ఇంటిగుమ్మంలో రేషన్ సరుకులైన బియ్యం, కందిపప్పు అందిస్తున్నాం. ఈవిధానాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధుల బయోమెట్రిక్ మిషన్‌లో గుర్తించబడని వారికి మా బయోమెట్రిక్ వేసి సరుకులు ఇస్తున్నాం.

– ఆకుమర్తి స్వరూప్‌కుమార్, వలంటీరు. తణుకు

వైఎస్సార్ బీమా అందజేత



తణుకులో బాధిత కుటుంబ సభ్యుడికి వైఎస్సార్ బీమా అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మృతుల కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా అండగా నిలబడుతుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం అత్తిలి మండలం వరిఘేడు గ్రామానికి చెందిన కటికిరెడ్డి మాణిక్యాలరావు ఇటీవల మృతి చెందిన ఘటనకు సంబంధించి సహజ మరణంగా కుటుంబ సభ్యులకు మట్టిఖర్చుల నిమిత్తం రూ. 10వేలు అందజేశారు. వైఎస్సార్ బీమా కార్యక్రమంలో భాగంగా ముందుగా మట్టి ఖర్చులకు రూ. 10వేలు ఇచ్చామని రానున్న రోజుల్లో రూ. 90వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేయనున్నట్లు చెప్పారు.

21న ప్రత్యేక వైద్యులు అలంపురం రాక

పెంటపాడు: ఈనెల 21న ఆదివారం అలంపురం వెంకటరమణ సేవా ఆస్పత్రికి ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు కొలనువాడ పెద కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ తీగల రమేష్ నరాలకు సంబంధించి ఉచిత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. మెదడు, నరాల వ్యాధులతో ఇబ్బందులు పడేవారు తప్పక ఈ ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆస్పత్రి వద్ద పేర్లు, నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సేవలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 19వ తేదీన 11కేవీ సబ్ స్టేషన్‌లు సత్యవతినగర్, రైల్వే ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం రోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. రైల్వే స్టేషన్ రోడ్డు, కోతిబొమ్మ సెంటర్, వెంకటరత్నం ఆస్పత్రి ప్రాంతం, భూపాల్‌నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, వీకర్స్‌కాలనీ, సిపాయి పేట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుల గణనను సమగ్రంగా నిర్వహించాలి



కుల గణనపై అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

తణుకు టౌన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనకు గ్రామాల్లో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు ఖచ్చితమైన సమాచారం కోసం కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు చెప్పారు. గురువారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో కె కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు తెలిపారు. గురువారం డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని 3,4 వార్డులలో కీటకజనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. వార్డులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పనిచేద్దామన్నారు. తప్పనిసరిగా వారానికి ఒక్కసారి డ్రై డే పాటించడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరళ, వెంకట లక్ష్మి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్ల పంపిణీ



భీమవరంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ ఎండీ మున్వర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవని పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల పక్కన జీవనం సాగించే పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాబ్జీ, తాహీర్, ఖలీల్ అహ్మద్, మక్బూల్, సుబ్బయ్య, హనుమంతు, ఆదినారాయణ, న్యూటన్, సుబ్బారావు పాల్గొన్నారు.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్‌పై అవగాహన అవసరం



భీమవరంలో పెన్షనర్లకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వం పెన్షనర్లకు జీవన ధృవీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్) సమర్పణపై అవగాహన కల్పించాలని భీమవరం ఎస్‌టీవో అల్లూరి రవివర్మ అన్నారు. భీమవరంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటు చేసిన పెన్షనర్స్ జీవన ధృవీకరణ పత్రాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈనెల 29వ తేదీలోగా ధృవీకరణ పత్రాలను అందించాలని, దీనికి సంబంధించిన సర్టిఫికెట్స్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో లేదా ఇంటర్ నెట్ ద్వారా పొందవచ్చునన్నారు.

ప్రతి ఇంటి బాగోగులు మా కర్తవ్యం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ప్రజలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఇంటి బాగోగులు చూడటమే మా కర్తవ్యమని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో సకల జన సమ్మేళన పాదయాత్ర నిర్వహించారు. తొలుత గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఆరుగొలను గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి జీజీఎంపీ నిధులు రూ.20లక్షలు, ఎస్సీ సబ్ ప్లాన్, తన నిధులను వెచ్చించనున్నట్టు తెలిపారు. బీసీ, ఎస్సీ కాలనీల్లో అవుట్ లెట్‌ల నిర్మాణానికి దేవరపల్లిలోని గోదావరి స్పెషల్ డివిజన్ నుంచి స్కెచ్ రప్పించినట్లు తెలిపారు. వీటిని అన్ని గ్రామాలకు పంపించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలకుల తెలివి తక్కువ తనం వల్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. డ్రెయినేజీ పైపులపై గ్రావెల్ వేసి పూడ్చారన్నారు. తద్వారా బిల్లులు చేసుకున్నారని విమర్శించారు. అయితే ప్రజల ఇబ్బందులను పట్టించుకోలేదన్నారు. వారం, పది రోజుల్లో గ్రామస్తుల ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని వ్యత్యాసాలను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. ప్రజలకు అవసరమైన ఉచిత వైద్యాన్ని అందజేస్తున్నామన్నారు. పేదల జీవితాలను బాగు చేసిన మహనీయుడు జగన్ అని కొనియాడారు. బడుగు, బలహీనవర్గాలందరూ సమానమని భావించిన ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఈ నెల 19వ తేదిన ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ప్రతి సచివాలయం నుంచి ఏడుగురు చొప్పున ఈ కార్యక్రమానికి తరలించనున్నామన్నారు. ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, ఎమ్పీటీసీలు నార్ని శంకరరావు, నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), జంపెల్ల సత్యవతి, వెంకట్రావుపాలెం సర్పంచ్ ఎలిపే గాంధీ, మాజీ సర్పంచ్‌లు కోనేటి దానయ్య, మాకరాజు సతీష్, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ల తాతారావు, పరిమి తులసీదాస్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, నాయకులు సబ్బితి బ్రహ్మయ్య, వట్టూరి నాగులు, గోపిరెడ్డి సత్యనారాయణ, చిక్కాల ఏడుకొండలు, గోపిరెడ్డి సాంబశివరావు, అడపా శ్రీను, అడ్డగర్ల ఏడుకొండలు, ఆర్‌బీకే చైర్మన్ ఆరేపల్లి సుబ్బారావు, అద్దాల సత్యనారాయణ, యాతం సత్యనారాయణ (పెద్దోడు), మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, తమ్మిశెట్టి చుక్కయ్య, కారింకి వీర్రాజు, చెన్నా జనార్దనరావు, తహసీల్దార్ శివశంకర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడిఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైకేవీ.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, వ్యవసాయ శాఖ ఏఈవో మాధవ వర్మ, వీఏవో బి.విజయ్, సచివాలయ కార్యదర్శి ఉప్పు విజయలక్ష్మి, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ఆరుగొలనులో ఆర్బీకేను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

అన్నదాత దేశానికి వెన్నెముక



వీరంపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: రైతు దేశానికి వెన్నెముక అని, అటువంటి రైతులకు సహాయ, సహకారాలు అందించే ఉన్నతమైన విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అభినందనీయులని వీరంపాలెం సర్పంచ్ కేతిరెడ్డి మాధవి అన్నారు. గురువారం మండలంలోని వీరంపాలెం గ్రామంలో జాతీయ సేవా పథకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సర్పంచ్ మాధవి మాట్లాడారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మల్లిఖార్జునరావు, డాక్టర్ రాజేష్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలు, సేవాతత్పరతతో మెలగాలని సూచించారు. ఏరువాక కేంద్రం (పెద్దాపురం) శాస్త్రవేత్త డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ ఇదొక అవకాశంగా తీసుకుని సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, గ్రామంలోని చెత్తా చెదారాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డాక్టర్ చామన శ్యామ్‌రాజ్‌నాయక్, అధ్యాపకులు వసంత భాను, టి.ఉషారాణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ జి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాందువ్వలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల ధ్వంసం



ఫ్లెక్సీలు చించేసిన దృశ్యం

ఉండి: మండలంలోని పాందువ్వ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం, క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చించేశారు. దీనిపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, సోషల్ మీడియా మండల కో కన్వీనర్ గొంతే హరీష్ మండిపడ్డారు. ప్రజాభిమానం ఉన్న నాయకుడు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అని, ఫ్లెక్సీలు చించినంత మాత్రాన ఆయన గెలుపును అడ్డుకోలేరని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇతర పార్టీల ఫ్లెక్సీలు భద్రంగానే ఉంచుకుని వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను మాత్రం చించివేయడం చూస్తుంటే వైఎస్సార్ సీపీ నాయకులను చూసి భయపడుతున్నారని అర్థం అవుతుందన్నారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందనే భయం వారిని వెంటాడుతుందన్నారు. సామరస్యంగా గ్రామంలో అన్ని పార్టీల వారు వారి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటే వైఎస్సార్ సీపీకి చెందినవి మాత్రమే చించివేసి, ముఖాలు కోసిన తీరు చూస్తుంటే వైఎస్సార్ సీపీ జెండాకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు వారెంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. ఎవరు ఎన్ని చేసినా అటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని, ఇటు ఉండిలో పీవీఎల్ నర్సింహరాజు గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని అన్నారు. ఫ్లెక్సీలు చించివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలే డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకువెళతామని ఈ సందర్భంగా హరిష్ తెలిపారు. అలాగే ఈ ఘటనపై స్పందించిన వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు మాట్లాడుతూ ఈ విషయాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకువెళ్ళామని ఫ్లెక్సీలు చించివేసిన వారు ఎవరైనా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ముందుకు వెళుతున్నామని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'



ఫైనల్‌కు చేరిన పెంటపాడు-3 కబడ్డీ క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు, పీడీలు

పెంటపాడు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని ఎంఈఓ టి.వి.రామక్రిష్ణ, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళలు పేర్కొన్నారు. మండలంలోని ఎస్‌టీవీఎస్ హిందూ హైస్కూల్‌లో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్వార్టర్, సెమీఫైనల్ కబడ్డీ పోటీలు గురువారం ఉత్కంఠగా సాగాయి. క్రీడాకారులంతా ఉత్సాహభరిత వాతావరణంలో ఆడి తమ క్రీడాస్ఫూర్తిని నింపారు. యువ క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల స్థాయిలో ఫైనల్ కబడ్డీ మ్యాచ్‌లో పెంటపాడు-3 టీంను మండల పురుషుల కబడ్డీ టీంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఇంకా మెరుగైన ప్రతిభ కనపరచాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, తహసీల్దార్ జీవి శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, పార్టీ నాయకులు బర్ల జయరామ్‌బాబు, నల్లిమిల్లి అంజిరెడ్డి, బండారు రాంబాబు, ఉండ్రాజవరపు రాజు, క్రీడల ఇన్‌చార్జి శేఖర్, పీఈటీలు సత్తి కన్నారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సాయి హరనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, యోహాను, కృపావరం, రావిపాడు శ్రీనివాస్, వైశాలి, ఉమామహేశ్వరి తదితరులు పర్యవేక్షించారు.

విద్యార్థులు అంబేడ్కర్ ఆశయాలను అనుసరించాలి

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో అంబేడ్కర్ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి మాట్లాడుతూ విజయవాడలోని స్వరాజ్ మైదానంలో శుక్రవారం 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఆధ్వర్యాన ఆవిష్కరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

కోడి పందేలపై 31 కేసులు

వీరవాసరం: మండలవ్యాప్తంగా కోడి పందేలు, పేకాటలపై దాడులు చేసి 31 కేసులు నమోదు చేసినట్లు వీరవాసరం ఎస్సై పి.రమేష్ గురువారం తెలిపారు. వీరవాసరం, రాయకుదురు, జొన్నలపాలెం, నవుదూరు, అండలూరు, మత్స్యపురిపాలెం తదితర గ్రామాల్లో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్న వారిపై దాడులు చేసి 31 కేసులను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారివద్ద నుంచి రూ.1,03,850 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

ప్రణాళిక రూపకల్పనపై శిక్షణ



తణుకు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ రుద్ర ధనరాజు

తణుకు టౌన్: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక అన్ని శాఖలతో సిద్ధం చేసుకొని సమన్వయం చేసుకోవాలని ఎంపీపీ రుద్ర ధనరాజు కోరారు. తణుకు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రామ అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన 165 అంశాల్లో ఆయా పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి పనుల ప్రణాళికలను వెంటనే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ బీమా సంస్థలను పరిరక్షించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వరంగ బీమా సంస్థ ఎల్ఐసీని పరిరక్షించుకోవాలని అఖిల భారత బీమా విశ్రాంత ఉద్యోగుల సంఘం జాయింట్ సెక్రటరీ గరికిపాటి బాపయ్య శర్మ విజ్ఞప్తి చేశారు. ఎల్ఐసీని జాతీయకరణపై ఆర్డినెన్స్ జారీ చేసిన 1956, జనవరి 19వ తేదీన ప్రభుత్వరంగ పరిరక్షణ స్ఫూర్తి దినంగా పాటించాలని గురువారం పట్టణంలో ఆయన విజ్ఞప్తి చేశారు. గడిచిన 68 సంవత్సరాల్లో ఎల్ఐసీ స్థాపించడం, ప్రగతిని సాధించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా ఎల్ఐసీ నిలిచిందని కొనియాడారు. సుమారు 32 కోట్లు పట్టాదారులు, 45 లక్షల కోట్లు విలువ చేసే ఆస్తులతో ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థగా ఎల్ఐసీ ఉందని వెల్లడించారు. ప్రజల సొమ్ము ప్రజల అవసరాలకే అనే నినాదంతో ఎల్ఐసీ ముందుకు సాగుతుందని, ప్రతి ఒక్కరు ఎల్ఐసీని పరిరక్షించుకోవాలని కోరారు.

క్రాస్ కంట్రీ పోటీలకు తణుకు విద్యార్థిని ఎంపిక

తణుకు టౌన్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మహిళా క్రాస్ కంట్రీ ఇంటర్ కాలేజియేట్ యూనివర్సిటీ ఎంపిక పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినీలు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె రామకృష్ణ తెలిపారు. ఈనెల 12వ తేదీన రాజమండ్రిలో జరిగిన ఈపోటీల్లో తమ కళాశాల విద్యార్థినీలు బీ నాగలక్ష్మీ దుర్గ తృతీయ స్థానం సాధించడంతో పాటు ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నాందేడ్‌లో స్వామి రామానంద తీర్థ మర్తవాడ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ పోటీలకు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ జట్టుకు నాగలక్ష్మీ దుర్గ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, పీడీ రత్నకుమారి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.